# లేళ్ళపాకలా చాయుల

కికారణ్యంగా దోచే ఏడు మళ్లులు దాటి రోడ్డునే నడకెక్కేసి ఓమెట్టు దిగేలో ఇటూ అటూ చెట్టూచేమాలేని బహిరంగ ప్రదేశం కన్నబోతాం. కొన్ని తాటాకపాకలు, పాకలముందు రుబ్బురోళ్ళు, తిరగళ్ళు మలుచుకునే జనం ఆ బహిరంగ ప్రదేశాన్ని పనిసంవడి గొలుపుతూ వుంటారు.

"లేళ్ళ పాకలా చాయల" అంటే అది రంగస్థలము.

కాని ఎంచేతో ఆ సమయానికి అక్కడెవళ్లూ లేరు. ఒకచోట మాత్రం ఒక్క వృద్ధుడు ఎన్నాళ్ళన్నా పిల్లిగడ్డమే అన్నట్టు పెరిగిన కించిత్తు గడ్డం గలవాడు, నరాలూ, నాళ్లూ, కొబ్బరీనెల్లాగు వెల్లడైనవాడు, సన్ననివాడు, చామనచాయవాడు, తన దృష్టి నంతనూ కేంద్రీకరించి ఓ రాతిని పగులగొడుతూ వున్నాడు— కంకరకు పనికివచ్చే పెచ్చులు, ఆమడదూరం వినవచ్చే శబ్దంతో ఫిరంగి గుండల్లే తగిలేటంత వాడితో విడవడేటట్టు పగులు గొడుతు వున్నాడు. పైమీద కండువాలేదు. నెత్తికి తలపాగలేదు. మొలత్రాటినిబట్టి ఓ కౌపీనమ్మాత్రం వాని కాచ్ఛాదన సమకూరుస్తూ ఉంది. వాని తలకాయ పిలకలేక, గిరజాలేక, సిగలేక, సింగారం లేక, నమాజుకు వంగే మహమ్మదీయుని బుఱ్ఱ అని చెప్పక చెప్తూవుంది.

వానికి వచ్చినభాష ఇదీ అని తెలుసుకోవడానికి వా డెవళ్ల తోటీ ఆ నిమిషాన్ని మాట్లాడ్డంలేదు. ఆకాశంలో కూడా పలుకరించే మేఘమేదన్నా వానిమీదుగా పోతూవుందా అంటే అదీలేదు. దక్షిణదెస ఒక్కటే—పెద్ద గడ్డిబొద్దులా పైకిలేచిన తెల్లని మేఘం ఉఱుములేని మేఘం, మెఱుపులేని మేఘం ఎందుకులేచిందో అంత అలా ఉవ్వెత్తుగా అని ఆశ్చర్యంగొలిపే మేఘం అంచు అన్నా చెఱుచుకోని, పంచకన్నా తప్పుకోని మేఘం, ఆకాశపు

టొరగు ఎక్కడ ప్రారంభిస్తుందో ఆ ఎత్తుకు కొట్టుకొచ్చే రూపంతో వున్న మేఘం ఒక్కటేవుంది. తక్కినదంతా విశాలా వినీలతమ విశ్వం. పడమటకు తిరిగిపోయిన పొద్దు అశాశ్వతం.

ఆ పగలగొట్టిన బండరాతియొక్క పెద్దపెద్ద చిదురుపల్ని విడిచిపెట్టి-ఆ వృద్ధుడొక బెత్తెడుముక్క తీసికొని ఇంకా ఇంకా మలుస్తూ దానిమీద గీతలు గీతలుగా గీస్తూ ఏదో తయారుచేస్తూ వున్నాడు.

దారేపోయే బాటసారుల్ని చూడ్డంలేదు ఆ ముసిలిమనిసి. కాని దారంట పోయిజనం పోతూనేవున్నారు. గూడెంలో ఉన్న వాళ్లు తక్కిన యావన్మందీ యేమైనారూ అంటే ఆ బాటసారులికే ఎరుకలేదు. ఈ ముసలిమానిసికే ఎరుకలేదు. కొందరు రాతిగనుల్లో అక్కడి రాళ్ళక్కడే పగులగొట్టుకుంటూ మల్చుకుంటూ వుండొచ్చును. కొందఋ కంట్రాక్టదార్లు కొట్లకుపోయి యుండ వచ్చును. కొందరు తాగుడుకు వెళ్లివుండొచ్చును. ఏమిటిదానికి? మానవులుండేతావు ఒక్కొక్కప్పుడు నిర్మానుష్యంగా ఉందా అంటే ఆశ్చర్యపడవలసిన అవసరంలేదు. మదరాసు మౌంట్‌రోడ్ సాయంకాలం మూడుగంటల కున్నట్టు సాయంకాల మూరు గంటల కుంటుందా? చైనాబజారు సాయంకాల మూరుగంటల కున్నట్టు రాత్రి తొమ్మిదిగంటల కుంటుందా? మూర్‌మార్కెట్టు రాత్రి తొమ్మిదిగంటల కున్నట్టు అర్ధరాత్రివేళ వుంటుందా? అర్ధరాత్రి కలకలమంటు మిలమిలమంటూ మిళావుగొలిపే జనప్రవాహాన్ని ఇవతలకు వదిలివేసే ఎల్ఫిన్‌స్టన్ థియేటర్ తెల్లవారగట్ల జనాన్ని వదులుతుందా? ఎప్పటి సందడి అప్పటిది. ఎక్కడి సందడి అక్కడిది. బాటసారులలోనైనా సరాగాలుగాని పలుకరించుకోవడాలుగాని ఏమీలేవు. అన్యోన్యం తెలుసుకుందా మనే కొత్తచూపులు వుబలాట పడ్డానికి తగ్గ ఎదరవాలూ రాక పోకలు గావు.

బాటసారులు పట్టి ముష్టివాళ్ళు. ఆక్షణం అలాపోతూ వున్నవాళ్లు వాళ్లను ఎప్పుడు అడిగినా ఏవూరునుంచి వస్తున్నారూ అంటే పైయూరునుంచి వస్తూ ఉన్నాము అనే రకంగాళ్ళేగాని "మావూరునుంచి వస్తున్నా" అనేవాళ్ళుకారు.

మగవాడు కావిడి వేసుకున్నాడు. కావిడి కిటూ అటూ కుండా మండా చాపా చదరా చేట జల్లెడా పన్నుకున్నాడు. వాడికి కుడితినీ వుంది. తలను తలపాగవుంది. అలా కావడి మీదనుంచి ఓచేయి రానిచ్చి ముందుకు పడేసుకునే వడుపులో గుప్పిటనే వుండీలబద్ధ ఉంది. వాడివెనకాతల పెళ్లాంచంక నోబిడ్డకు పాలిచ్చుకుంటూ వస్తూవుంది. వారి వెనకాతల కుఱ్ఱాడు నడుస్తూ ఉన్నాడు. ఆపక్క ఈపక్క రుప్పలు మూచూచుకుంటూ ఓకుక్క వాళ్ళదే అన్నట్టు వాళ్ళకేసి మధ్యమధ్యచూస్తూ వాళ్లతో నడుస్తూవుంది.

ఆ బికుక కుటుంబము తిన్నగా ఆగి చుట్టూ ఓమారుచూచి చెట్టూ చేమాలేని ప్రదేశం అవడంచేత ఎక్కడ దిగడమా అని యోచించుకున్నట్టు యోచించుకుంటూ క్రమంగా ఆవృద్ధుని చెంత కాళీగావున్న ఓ పాక సమీపించి అందులో సామానూ అదీ పెట్టుకున్నారు. ముసలివాడు అది చూణ్ణేలేదు. వాడూరికే మొగమంతా రాతిమీద కొంచుకొని రాయి గాచుకోవడం చెలుపు కోవడం రెండుపనులే చేస్తూ ఉన్నాడు.

ఆచేస్తూ ఉండడంలో వాడికి మొగమ్మీదికి పోలుస ఒక రాతిముక్క ఎగిరిపడి కుడికంటిలో మెఱయడం మొదలు పెట్టింది. నీళ్ళు కారుతూంది కన్ను. వెంటనే పని కట్టిపెట్టి వాడు వెనక్కి తన గుడిసెకేసిచూస్తూ 'ఎవరందులో' అన్నాడు.

"మేం తాతా! డుబుడక్కలాళ్ళం తాతా! మీయూరు అడుక్కొని రేపెళ్ళిపోతాం" అన్నాడు కావిడితీసుకొచ్చిన మగాడు. ఉండీలబద్ద చేతబుచ్చుకుని ఇవతలకువస్తూ ఆకాశం వంక తేఱిపాఱిచూస్తూ.

"చూడుబాబా! ఇలారా!" అన్నాడు ముసలివాడు. ముష్టివాడు దగ్గరకు వెళ్ళేడు. "చూడు నాకన్ను కొంచెంపూడు. రాతిపలుకు పడింది" అన్నాడు. వాడూదేడు. తాతకు కంటి చూపు కొంచెం ఆనింది. ముష్టివాడన్నాడు "ఇలా రాళ్ళుచెక్కి కష్టపడ్డంలో దెబ్బతప్పి చెదిరిందా అంటే మొగానికి తగిలి మోసంపుడుతుంది అన్నమాటే తాతా!" అన్నాడు. "తగుల్తుంది బాబా! మేం కొట్టే ప్రతీగంటకూ మా గుండెలో ఒక గంటు ఏర్పడివుండి ఉంటుంది. అంచేత మొగానికి తగిలినా లక్ష్యం చేయము. ఇప్పుడేమిటో కంటిలోపడి మెఱవడంచేత ఇంత ఇదై పోయాను. గాని–అ గుడిసెలో పెట్టుకున్నారా మీ సామాను? అందులో వుంటారా మీరు? రేపే వూరు అడుక్కొని పోతారా? రాత్రికి తిండి మీకు?" అన్నాడు ముసిలివాడు. భిక్షుడన్నాడు "ఇదిగో ఉండీలబద్ధ. పిట్టనుకొట్టి పొయిలోపెట్టి–" అన్నాడు. ముసలివాడన్నాడు "ఆ-ఆ ఉండీలబద్ద విసరుతప్పితే నీ కంటి గాని వొంటిగ్గాని మోసంరాదూ?" అన్నాడు. భిక్షుడన్నాడు "తగిల్తే పిట్టకు తగుల్తుంది. లేకుంటే ఆకాశంలోకి పోతుంది, నాకేం తగల్దు—" అని.

"ఆది వెనక్కివచ్చి నీకు తగిలివుంటే నీకు తెలుసునురా బాబా! నీవు చేసేపనియొక్క మహాక్రౌర్యము—ఏపిట్టనుకొట్టినా బాబా! వడ్రంగిపిట్టను మాత్రం కొట్టకు" అన్నాడు ముసిలి. "ఏం" అని అడిగేడు ముష్టివాడు. "నాయొక్క దెబ్బకు సుతిగా టక్కుటిక్కు శబ్దంచేసేది అది వొక్కటే" అన్నాడు ముసిలి.

ఆ మాటమీద డుబుడక్కలవాడు అన్నాడు "తాతా! రాతిని బద్దలు కొట్టినట్లు నాయొక్క రాతిగుండెను బద్దలుకొట్టి అందులోనుంచి జాలిరసం వొలికించేవోయి తాతా? నిజంగా అలా నీలాగు ఆలోచిస్తే నా డొక్కు శబ్దానికి ప్రతిశబ్ద మియ్యని పదార్థ మేంవుందోయి యీ జగత్తులో. నేనేపిటనూ ఈపెని

కొట్టనుతాతా! పొద్దున్నే నీగుడిసెకే ముందువచ్చి డుబుడక్ వాయించిపోతా” నన్నాడు.

“నా గుడిసె నీకు తెలుస్తుందా?” అన్నాడు. “ఏం నీవుండవు అందులో?” అన్నాడు భిక్షుకుడు. “నేనుంటే మీరెల్లా దిగడానికి ఆస్కారం వుంటుంది?” అన్నాడు వృద్ధుడు. “అంటే నీదేనన్నమాట మేం దిగినగుడిసె. అంత ఖాళీగా అంత పాతదిగా అంత విడిచిపెట్ట బడ్డదిగా ఉన్న గుడిసె నీదేనన్నమాట!” అన్నాడు బుడబుడక్కలవాడు.

“నాదే నాదే” అంటూ తేరకొన్న తన కంటిచూపుతో తాను చెక్కుతున్న ఆ బెత్తెడురాయి పట్టుకొని పట్నంవంక తిరోహితుడైనాడు ఏడుమళ్ళుల కికారణ్యప్రాంతాల్లో ఆ ముసలివాడు.

మళ్లీ ముసలివానికేక వినబడ్డాది పట్నం వీధిలోనే. “గవిరిదేవి విగ్రహం గవిరిదేవి విగ్రహం చేసికొచ్చానండో అమ్మా!” అని ఓ భవనమ్ముందు ముంగిట.

సంధ్య చీకటివేళ-కనబడ్డ తెల్లనిమేఘం అంతా హారతి కర్పూరబిళ్ళల్లే అంటుకుని హరించిపోయి నీరాజనమిస్తూ వుందా అన్నట్టు ఆకాశాన్ని రంగుమారిపోయి వాని ముఖమ్మీద ప్రకాశిస్తూవుంది.

... ... ... ... ...

## పల్లెటూళ్ళ నాటకాల సందడి

సక్కుబాయి నాటకం అంట ఈయేళ మనూళ్లో రావూ!”

“ పిక్కట్టుందా ?”

“ లేదు. ముక్కాలి పీటలు మనవి మనం పట్టుకెళ్ళి ఈధిలో వేసుకుని కూకుని ఓపికున్నంతసేపు చూచి వచ్చెయ్యొచ్చునంట. రా! బేగిరా! నేనెల్తావుంటా”

... నాటకానికి వెళ్ళేముందు.